# విషయ సూచిక

## సైన్స్ ఫిక్షన్ కథలు


1. సైన్స్ ఫిక్షన్ కథ – ఉపోద్ఘాతం ........ 1
2. ఆద్యంతాల మధ్య ........ 12
3. ఉలిపి కట్టెలు ........ 30
4. బ్రహ్మసూత్రం ........ 38
5. ఆత్మాఫాక్టర్ ........ 53
6. బ్రహ్మజ్ఞానం ........ 63
7. ఏలియన్ రిపోర్ట్ ........ 96
8. మానవ ఫాక్టర్ ........ 130
9. 'మిస్'డ్ యూనివర్స్!! ........ 145
9. సైబర్ జస్టిస్ ........ 175
10. సైబర్ జస్టిస్ కథ ........ 177
11. సరస్వతీ తీరాన ........ 192
12. డాక్టర్ అశ్విని ఎం.డి. ........ 233
13. గాలక్టిక్ బార్ ........ 248
14. త్రికాల సంధి ........ 262
15. విశ్వగానం ........ 291
16. ఒక విమర్శ – వల్లంపాటి వెంకట సుబ్బయ్య "కథాశిల్పం" ........ 310

# సైన్స్ ఫిక్షన్ కథ - ఉపోద్ఘాతం

ఓ చిన్నక్విజ్

మీరు సైన్స్ ఫిక్షన్ నవలలు, కథలు చదివారా?

టైమ్ మెషిన్?.. వార్ ఆఫ్ ది వరల్డ్స్?... జర్నీ టు ది సెంటర్ ఆఫ్ ది ఎర్త్?.. ఫౌండేషన్ సీరీస్?... డూన్ ట్రిలజీ?... 1984?... బ్రేవ్ న్యూ వరల్డ్?...

మీరు సైన్స్ ఫిక్షన్ సినిమాలు చూశారా?

స్టార్‌వార్స్?... క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్?... ఏలియన్?... టెర్మినేటర్ 1,2,3?... అవతార్?... బాక్ టు ది ఫ్యూచర్ 1,2,3?... జురాసిక్ పార్క్?... కింగ్ కాంగ్?...

సైన్స్ ఫిక్షన్ టెలివిజన్ సీరియల్స్ చూశారా? స్టార్ ట్రెక్?... డాక్టర్ హూ?... X-ఫైల్స్?...

వీటికి మీ సమాధానం అవును అయితే మీరు సైన్స్ ఫిక్షన్ అభిమాని నాలాగే. ఇంకా కోట్లాదిమంది లాగే.

కాదు అంటే సింపుల్. మీరు ఆ పుస్తకాలు చదివి, ఆ సినిమాలు, టివి సీరియల్స్ చూసి ఆనందించండి.

సైఫి!

సైన్స్ ఫిక్షన్!!

ప్రపంచ సాహిత్య మహాసముద్రంలో ఓ మహత్తర కెరటంలా విరుచుకుపడి సాహిత్యంలో కథనీ, నవలనీ ఇతర ముఖ్య వినోద సాధనాలైన సినిమాలను, టీవీ ప్రోగ్రామ్‌లను, వీడియో గేమ్ షోస్‌నీ అత్యంత శక్తితో మార్చివేసి తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూ సర్వమానవాళిపైనా అంతులేని ప్రభావాన్ని చూపుతున్నది.

సైన్స్ ఫిక్షన్ ఇరవయ్యో శతాబ్దపు సాహిత్యం.

It is called the literature of change!

ఓ సమాజం శాస్త్రీయపరమైన అభివృద్ధి చెందుతూ టెక్నలాజికల్ వికాసంతో ఎన్నో మార్పులకి లోనవుతున్నప్పుడు ఇంకా పెనుమార్పులు వస్తాయని నిరీక్షిస్తుంటే ఆ మార్పుల వల్ల వచ్చే

# ఆద్యంతాల మధ్య

**మీట** నొక్కగానే "ఏదో ఆగిపోయినట్లు – మిషన్‌లోనూ మెదడులోనూ కుదుపు. సంవత్సరాల తరబడి ప్రయాణం క్షణాల్లో పూర్తయిన సంతృప్తి... క్షితిజ్ కొంచెం సేపు ఆ మిషన్‌లో అలానే కూర్చొని – తరువాత నెమ్మదిగా బైటకొచ్చాడు. మెట్లదగ్గిర, క్రింద తనకోసం తనలాంటి మనిషి ఎదురు చూస్తూ వుండటం చూసి ఆశ్చర్యపోయాడు.

వేయి సంవత్సరాల భవిష్యత్‌లోకి ప్రయాణం చేసి కూడా ఇక్కడ తనలాంటి మనిషినే చూడటం!

ఎదురుగా ఉన్న వ్యక్తి దాదాపు తన ఈడువాడే! అతను చెక్స్ వున్న స్పోర్ట్స్ షర్ట్ తొడుక్కుని వున్నాడు. సాదరంగా చెయ్యి వూపుతూ దూరంగా కనబడ్తూన్న ఇంటిలోనికి రమ్మని ఆహ్వానించాడు. మాట్లాడకుండా అతనిని అనుసరించాడు క్షితిజ్. ఆ గది చక్కగా అలంకరించబడిన డ్రాయింగ్ రూమ్!

"లోపలికి రండి" అన్నాడు ఆ వ్యక్తి. అతని కంఠస్వరం మృదువుగా వుంది. సంస్కారం, సభ్యత వున్న మనిషి కంఠం అది.

"రండి. మీ ఇల్లే అనుకోండి. ప్లీజ్ బి కంఫర్టబుల్"

క్షితిజ్ ఆశ్చర్యపడ్డాడు. ఈ వ్యక్తి వేషమే కాకుండా భాషకూడా తన కాలానికి చెందినట్టే వున్నది. తను మాట్లాడే తెలుగు, ఇంగ్లీషు మిశ్రమ భాష అంటే క్షితిజ్‌కి మొదటినుండి కొద్ది న్యూనతా భావం. ఇప్పుడీ వ్యక్తి ఎవరో అదే ఉచ్చారణతో, అదే పదజాలంతో మాట్లాడుతుంటే తనకి ఒక విధంగా ఉపశమనం కలిగింది. కాలమానంలో ప్రయాణం చేసివచ్చిన మనుషులకు ఇచ్చే రిసెప్షన్ ఇలాగే వుంటుందా అనుకున్నాడు.

మెత్తగా కూర్చోవడానికి సుఖంగా వున్న సోఫాలో మెల్లగా కూర్చుంటూ చుట్టూ గదిని అంతులేని ఆశ్చర్యంతో వింతగా చూశాడు. ఆ గది తన దేశానికి, తన కాలానికి అనుగుణంగా ఫర్నిష్ చేయబడి వున్నది. గోడకి బొమ్మలు, గుమ్మాల తెరలు, తివాచీ అన్నీ ఇరవై రెండో శతాబ్దానికి చెందినవే! తను కూర్చున్న సోఫా మందమైన లెదర్‌తో కుట్టబడి, ఎంతో హాయిగా వుంది.

"మీకు ఆశ్చర్యంగా వుంది కదూ!" అన్నాడు.

స్ఫురద్రూపి. దాదాపు తన ఎత్తువున్నాడు. బరువు కూడా అంతే వుండవచ్చు.

హెయిర్ డ్రెస్సింగ్ కూడా దాదాపు తనలాగే వుంది. భుజాలు దాటకుండా కత్తిరించబడ్డ జుట్టు, చెవులలోకీ మరీ క్రిందకి రాకుండా సైడ్ బర్న్స్.

దాదాపు తనను హేళనగా ఇమిటేట్ చేస్తున్నట్టుగా వుంది ఈ వాలకం.

"ఈ సస్పెన్స్ దుర్భరంగా వుంది" అన్నాడు క్షితిజ్ నెమ్మదిగా. పైగా "నేను వేయి సంవత్సరాల భవిష్యత్తులోకి ప్రయాణం చేసి చివరికి వర్తమానంలోకి వచ్చానని తెలియడం కొంచెం అసహజంగా వుంది"

యువకుడు నవ్వేడు.

"మీరు అలా అనుకోవటంలో ఏ మాత్రం అసహజం లేదు. నాగరికత ఎప్పుడూ చక్రభ్రమణంలో తిరుగుతూనే వుంటుంది. ఎక్కడ ప్రయాణం ప్రారంభమౌతుందో మళ్ళీ అక్కడికే చేరడం జరుగుతుంది. అది ప్రకృతి న్యాయం. ఆ.......! చెప్పటం మరచిపోయాను. నా పేరు బిజార్ పదకొండు – మీరు నన్ను బిజార్ అని పిలవొచ్చు. మీ పేరు నాకు తెలుసు. మిమ్మల్ని పేరుతో పిలిస్తే మీకు అభ్యంతరం లేదనుకుంటాను" అని ఆగిపోయాడు.

"మీరు నన్ను నా పేరుతో పిలవొచ్చు. కాని నా పేరు మీకెలా తెలిసింది. అయినా నాకర్థం కానిది ఒకటుంది. నేను వదిలిన భూమికి ఇన్ని సంవత్సరాల తర్వాత నేను తిరిగి వచ్చినదానికి అట్టే తేడా కనపడకపోవడం నాకు వింతగా వుంది"

"అన్నీ నెమ్మదిగా మీకు అర్థం అవుతాయి. ప్రస్తుతానికి చెప్పగలిగేది మాత్రం ఇదే. ఎత్తుపల్లాలూ, చీకటి వెలుగులూ, పగలూ – రాత్రులూ, పాజిటివ్ – నెగిటివ్, ప్లస్–మైనస్, ప్రగతి–తిరోగతి, డార్క్ ఏజ్–రినయజాన్స్, ఇవన్నీ సైక్లికల్‌గా బాలన్సింగ్ ఫెనోమెనా అంతా మీకు తర్వాత విశదీకరిస్తాను" అన్నాడు బిజార్.

"నేనొప్పుకోను" అన్నాడు క్షితిజ్. "నా లెక్కల ప్రకారం ఈ ఎత్తు పల్లాలను దాటి మానవజాతి మహోన్నత ప్రగతి సాధించి వుంటుంది. నేను భూమిని వదిలిన నాటికే ఆ అవకాశం, అందుకు కావలసిన విషయ పరిజ్ఞానం అంతా మానవాళికి అందుబాటులో వున్నాయి. ఆ తర్వాత ఏడెనిమిది వందల సంవత్సరాల్లో ఆ ప్రగతిని సాధించి వుంటారని నేననుకున్నాను. అందుకే నేను ఆ కాలాన్ని కూడా దాటి ఇంకో మూడు వందల ఏళ్ళ భవిష్యత్తులోకి వచ్చాను. నా శతాబ్దానికి చెందిన మనుషులకి వారి వంశీయులకీ ఎన్నోతరాల దూరంగా, ఇన్నేళ్ళు మానవాళి ఎలా పరిణతి చెందుతుందో వూహించలేనంత దూరానికి పోదామని నిశ్చయించుకుని నేనీ ప్రయాణాన్ని తలపెట్టాను. ప్లీజ్! మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగాలనుకుంటున్నాను."